క్లుప్తంగా

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు


ఏవో జ్యోతిర్మయి

దొరవారిసత్రం : మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిణి జ్యోతిర్మయి తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు అవసరమైన రైతులు ఆధార్ జిరాక్స్‌లతో ఆయా ప్రాంతాల్లోని ఆర్బీకేల వద్దకు రావాలన్నారు. ప్రస్తుతం సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలో 1,726 క్వింటాళ్ల జీలుగ, 202 క్వింటాళ్ల జనుము, 155 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. జీలుగ, జనుము క్వింటాళ్ ధర రూ.8,800 ఉండగా 50 శాతం సబ్సిడీతో రూ.4,400లు, పిల్లిపెసర రూ.13,400 గాను సబ్సిడీ కింద రూ.6,700లకు అందజేస్తామని పేర్కొన్నారు.

సంపూర్ణమ్మ సేవలు ప్రశంసనీయం


సంపూర్ణమ్మ, రత్నంను సత్కరిస్తున్న ఎంఈవోలు శ్రీనివాసులు, జిలానీబాషా

రాపూరు: రాపూరు నార్త్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ చేసిన సంపూర్ణమ్మ సేవలు ప్రశంసనీయమని విద్యాశాఖాధికారులు శ్రీనివాసులు, జిలానీబాషా తెలిపారు. స్థానిక షాదీమంజిల్‌లో శుక్రవారం సంపూర్ణమ్మ, ఆమె భర్త రత్నంను ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ 38 సంవత్సరాలు సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంతో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

దొరవారిసత్రం : నెలబల్లి గ్రామ నడిబొడ్డున ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి అమ్మవారి మెడలోని తాళి బొట్టు హుండీలోని నగదు చోరీ చేశారు. ఈ విషయం శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు రోజూలాగానే పూజలు అనంతరం గురువారం రాత్రి పూజారి ఆలయానికి తాళాలు వేసుకుని వెళ్లిపోయాడు. శుక్రవారం ఉదయం గుడిని శుభ్రం చేసేందుకు విచ్చేన ఓ మహిళ తాళాలు పగుల కొట్టి ఉండడాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. గ్రామస్తులు గుడి వద్దకు వెళ్లి చూడగా అమ్మవారి మెడలోని ఒటిన్నర సవర్ల బంగారు తాళిబొట్టు, హుండీని చోరీ చేసినట్టు గుర్తించారు. హుండీలో రూ.50 వేలకు పైగా నగదు ఉంటుందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీధనమల్లిలో చురుగ్గా పారిశుద్ధ్య పనులు


పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం : శ్రీధనమల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌మస్తాన్, సర్పంచ్ రమాదేవమ్మ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తొలుత గ్రామంలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. తాగునీటి పైపులైన్‌లకు మరమ్మతులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న శ్యామ్ సుందరరావు

గూడూరు రూరల్ : విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని రొటేరియన్ డాక్టర్ శ్యామ్‌సుందరరావు అన్నారు. ఆయన శుక్రవారం ఏపీ గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలో చిన్నారుల జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలో ఈ నెల పుట్టిన రోజు జరుపుకుంటున్న 9 మంది చిన్నారుల కోసం భారీ కేక్‌ను తీసుకువచ్చారు. వారితో కేక్‌ను కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ గురుకులంలో ఉన్న ప్రతి చిన్నారి పుట్టిన రోజున ఇలా వేడుకలు నిర్వహించి వారి ఆనందంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ మేరి ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కండలేరులో 6.321 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.321 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యాధుల కాలం... జాగ్రత్తలు అవసరం


ఉచ్చూరు గ్రామ నడిబొడ్డులో నిలిచిన నీరు


తల్లంపాడు గ్రామంలోని వీధి దుస్థితి

- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

దొరవారిసత్రం : మండలం పరిధిలో గత పక్షం రోజుల నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. వీధులు చిత్తడిగా మారడంతో పాటు గ్రామాల నడిబొడ్డులో పేడ దిబ్బలు, చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు వృద్ధిచెంది సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, డయేరియా, డెంగీ, వైరల్ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిసరాలు, వీధులను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలను నియంత్రించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఈసీజన్‌లో అధికంగా వచ్చే వ్యాధులు

మలేరియా: ఇది అనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుంది. ఈ దోమలు మురుగు నీటి గుంతల్లో వృద్ధి చెందుతాయి. మలేరియా సోకిన వారికి చలి, వణుకు, ఒళ్లునొప్పులు, విడిచి విడిచి జ్వరం రావడం జరుగుతుంది.

డెంగీ:
ఆకస్మికంగా జ్వరంతో పాటు ఒంటి నొప్పులు వస్తాయి. ఆడ ఈడిస్ దోమ వలన ఈజ్వరం వస్తుంది. ఈ దోమలు పగటి పూట ఎక్కువగా సంచరిస్తాయి. కీళ్లు, కండరాల నొప్పులు, వాంతులతో డెంగీ ప్రారంభం అవుతుంది. కొందరికి శరీరంపై ఎర్రటి దద్దులు ఏర్పడతాయి. తెల్లరక్త కణాల సంఖ్య బాగా తగ్గిపోయి ప్రాణాపాయం ఏర్పడుతుంది.

దయేరియా:
కలుషితమైన ఆహారం, నీటి వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. రోజుకు మూడు అంతకంటే ఎక్కు సార్లు నీళ్ల విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించవచ్చు. వాంతులు, విరోచనాలు, అతి దాహం, కడుపు నొప్పి ఈ వ్యాధి లక్షణాలు.

అందరూ అప్రమత్తంగా మెలగాలి



ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాం. అవసరమైన మందులను ఆయా ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుబాలో ఉంచాం. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి.

- వి.చైతన్య, వైద్యాధికారి, డీవీ సత్రం పీహెచ్‌సీ

8 సచివాలయాల్లో ఆధార్ సేవలు

చిల్లకూరు : నూతన జిల్లాలు ఏర్పడిన తర్వాత ఆధార్ కార్డుల్లో ఇప్పటికీ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగానే ఉంది. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లాను పొందుపరిచేలా మార్పులు చేసుకునేందుకు నియోజకవర్గంలో 8 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఎంపీడీవో భానుమూర్తి మాట్లాడుతూ తిరుప తి జిల్లా డీఎల్‌డీవో సుశీలాదేవి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన సచివాలయాలలో ఆధార్ సేవలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గూడూ రు మున్సిపాలిటీలో ఇందిరానగర్-3, గూడూరు మండలం-కొండాగుంట, విందూరు, చిల్లకూరు మండలంలో చిల్లకూరు-2, చింతవరం, కోట మండలంలో సిద్దవరం సచివాలయం, చిట్టమూరు మండలంలో చిట్టమూరు, ఈశ్వరవాక సచివాలయాల్లో ఆధార్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశంను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

9,272 మందికి పింఛన్ల పంపిణీకి చర్యలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీతో పాటు మండలంలో మొత్తం 9,272 మందికి పింఛన్ల పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. కొత్తగా ప్రభుత్వం పెంచిన పింఛన్ నగదును జూలై నెల 1 తేదీ నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ అందజేస్తారని పేర్కొన్నారు. మొత్తం 170 మందికి పైగా సచివాలయ ఉద్యోగులు ఒక్కొక్కరు 50 మందికి నగదు ఇస్తారని తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీలో 4,177 మందికి వివిధ రకాల పింఛన్‌లకు రూ.2,90,32,500, మండలంలో 19 గ్రామ పంచాయతీలకు సంబంధించి 5,095 మందికి రూ.3,50,37,000 అందజేయనున్నట్టు వివరించారు.

రాపూరమ్మకు ప్రత్యేక పూజలు

రాపూరు: రాపూరు గ్రామదేవత రాపూరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పాలాభిషేకం, ప్రత్యేక అలంకరణ, సాయంత్రం భజన చేశారు. అర్చకులు నాగేశ్వరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చిల్లకూరు : మండలంలోని మన్నేగుంట గ్రామంలో ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు మన్నేగుంట గ్రామానికి చెందిన నాగరాజమ్మ(33) తన కుమారుడు బడికి వెళ్లకుండా ఉండడంతో మనస్తాపం చెంది ఈ నెల 26న విషం సేవించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గూడూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో-2 జగదీష్‌బాబు


భవనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని ఎంఈవో-2 పి.జగదీష్‌బాబు తెలిపారు. ఆయన శుక్రవారం దక్కిలి పంచాయతీ కందలవారిపల్లి ఎస్టీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి ఆధునాతన పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. నూతనంగా మనబడి-నాడు -నేడు కింద జరుగుతున్న భవనాలను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయురాలు ఉప్పలూరు సరళకుమారి, ఉపాధ్యాయురాలు నామతోట రత్న ప్రభ ఉన్నారు.

ప్రజా సేవే లయన్స్ క్లబ్ ధ్యేయం


చీరలు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

గూడూరు రూరల్ : ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందని డిస్ట్రిక్ట్ చైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ తెలిపారు. పట్టణంలోని సరస్వి శిశు మందిరంలో శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్లబ్‌లోని సభ్యులు ఎప్పుడూ సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉంటారని తెలిపారు. అందులో భాగంగానే క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర దాతృత్వంతో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ మల్లెమాల మురళీరెడ్డి, రామ్మోహన్, వీరేంద్రనాథ్, ఎస్ఎల్‌వీ ప్రసాద్, జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కళ్యాణ సాయి రూపేష్‌రెడ్డి, మదనబేంటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో అధికారుల విస్తృత తనిఖీలు


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

సూళ్లూరుపేట రూరల్ : సూళ్లూరుపేట పట్టణంలోని హోటళ్లు, ఇతర దుకాణాల్లో జిల్లా ఆహార భద్రతా అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు చేశారు. జిల్లా ఆహార భద్రత అధికారి ఎస్.మద్దులేటి మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరించామని తెలిపారు. వాటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. వ్యాపారులకు ఆహార నియమ నిబంధలపై అవగాహన కల్పించినట్లు పేర్కొన్నా రు. నాణ్యతలేని ఆహార పదార్థాలను ప్రజలకు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు

గూడూరు రూరల్ : గూడూరు రెండవ పట్టణంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయని తెలిపారు. బీఎస్సీ, బీకాం, బీఏ మూడేళ్లు, నాలుగేళ్ల కోర్సులు ఉన్నాయని, అత్యుత్తమ అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 98660 08662, 95535 58613లో సంప్రదించాలని అన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

కోట: కోట మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దేవిక ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం సన్మానించారు. ఎంపీడీవో శంకరయ్య, కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ ఆమె సేవలను కొనియాడారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ సెక్రటరీలు రాజశేఖర్, రియాజుద్దీన్, కిరణ్, రాఘవరాజు, అల్లాబక్షు, శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న అడుగు జాడల్లో నడుస్తా


జెడ్పీటీసీ యామినిని అభినందిస్తున్న నాయకులు, ప్రజా ప్రతినిధులు

గూడూరు రూరల్ : జగనన్న అడుగుజాడల్లోనే నడుస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని తెలిపారు. ఆమె శుక్రవారం నెలటూరులోని ఆమె నివాసంలో అభిమానుల మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. ఆమెను పలువురు అభినందించారు. జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి మాట్లాడుతూ తాము జగనన్న ద్వారా రాజకీయాల్లోకి అడుగు పెట్టామని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన ఆయన వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో విందూరు, కొమ్మనేటూరు ఎంపీటీసీలు వెంకటరెడ్డి, వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్, రాజేష్, మస్తాన్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

పెళ్లకూరు: 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనుల కోసం భూములు కోల్పోయిన తమకు పరిహారం చెల్లించాలంటూ శుక్రవారం బాధితులు ఆందోళన వ్యక్త చేశారు. పెన్నేపల్లి, తాళ్వాయిపాడు, చిల్లకూరు, జీలపాటూరు గ్రామాలకు చెందిన రైతుల నుంచి రోడ్డు విస్తరణ కోసం అధికారులు భూములు తీసుకున్నారు. వారికి నోటీసులు జారీ చేసిన అధికారులు ఇప్పటి వరకు నగదు జమ చేయలేదు. కొంత కాలంగా రోడ్డు అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ నిర్వాసితులకు నగదు చెల్లించలేదు. రోడ్డు విస్తరణ కోసం తీసుకున్న భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలకు తక్షణమే నగదు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. నగదు చెల్లింపు విషయంలో జాప్యం చేస్తే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, జయరామయ్య, రవీంద్రరాజు, సుబ్రమణ్యం, సుధాకర్‌రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


పదవ తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో పూర్వ విద్యార్థులు

గూడూరు రూరల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86లో పదవ తరగతి చదివిన విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పాఠశాలలో శుక్రవారం 1986 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. తమ మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన కె.హర్షవర్ధన్, జి.గెర్షోమ్, ఎం.యావేష్‌కు నగదు బహుమతులు అందజేశారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎంబీ భారతి, వరప్రసాద్, దామోదర్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరి



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిల్లకూరు : ప్రభుత్వ శాఖల్లో పని చేసే ప్రతి ఉద్యోగికీ ఉద్యోగ విరమణ తప్పనిసరని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శివరామిరెడ్డి ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత శివరామిరెడ్డికి దక్కుతుందన్నారు. ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వరదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించడంలో శివరామిరెడ్డి ఎంతో కృషి చేశారని తెలిపారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణమ్మ, ఉప సర్పంచ్ ఇస్మాయిల్, పాఠశాల హెచ్‌ఎం బండ్ల సుధాకర్, చింతరం జెడ్పీ హెచ్‌ఎం శివసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి


కూలీలతో మాట్లాడుతున్న శివకుమార్

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి మించల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఉపాధి కూలీలతో కలిసి పనిచేశారు. ఆయన మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల పోరాట ఫలితంగా 2004లో సాధించుకున్న చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. కూలీలు పనిచేసే చోట వారికి మౌలిక వసతులు, తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో యువత వలస వెళ్లకుండా ఉపాధి హామీ పని జరిగేలా చూడాలని కోరారు.

ముగిసిన ఖాదర్‌షావలీ గంధోత్సవం


శ్రీవారి గంధాన్ని గమ్మటంలో ఉంచి దర్గా వద్దకు తీసుకొస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్ : పట్టణంలో ఉన్న హజరత్ ఖాదర్‌షావలీ (చిన్నదర్గా) గంధోత్సవాలు శుక్రవారం రాత్రి ఘనంగా ముగిశాయి. శుక్రవారం తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకున్న శ్రీవారి గంధాన్ని ముజావర్లు, ఫకీర్ల విన్యాసాల నడుమ దర్గాలో ప్రతిష్టించి పాతేహాలు జరిపి భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. మధ్యాహ్నం గిండి రోహిణి కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దర్గా వద్ద వందలాది మందికి అన్నదానం చేశారు. చిన్నదర్గా కమిటీకి చెందిన చాన్‌బాషా, శేఖర్, రఫీ, షేక్ రియాజ్, నీలిశెట్టి మహేంద్ర, వంశీ, చంద్రశేఖర్, యోగేంద్ర, పఠాన్ హర్షద్, మస్తాన్, కరీముల్లా, కడ్డీ, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు. రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.


గంధాన్ని దర్గా వద్దకు తీసుకొస్తున్న కమిటీ సభ్యులు


దర్గా వద్ద అన్నదానం చేస్తున్న దాతలు